సాక్షి మెదక్

శుక్రవారం । 23 । జూన్ । 2023



తప్పని సాగునీటి కష్టాలు

హుస్నాబాద్ మెట్ట ప్రాంత రైతులు వానల కోసం ఎదురు చూస్తున్నారు. వానాకాలం సాగుకు అనువైన కార్తెలు రోహిణి, మృగశిర ఆరుద్ర కార్తెలు రెండు ముగిసినా చినుకు పడలేదు. 8లో



సర్పంచ్ అనుమానాస్పద మృతి

అనుమానాస్పదంగా సర్పంచ్ మృతి చెందిన ఘటన మహాదేవుపల్లిలో జరిగింది. సర్పంచ్ నాగధర పాపయ్య మరికొందరితో కలిసి మద్యం తాగేందుకు వెళ్లాడు. 8లో

ధ్రువపత్రాల పరిశీలన

మెదక్ మున్సిపాలిటీ: సంగారెడ్డి జిల్లాలో శుక్రవారం ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల ధ్రువ పత్రాలను పరిశీలించనున్నట్లు ఎస్పీ రోహిణి ప్రియదర్శిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలను కూడా తీసుకురావాలని అన్నారు.

ఆనందం డబుల్

కేసీఆర్‌నగర్‌ను ప్రారంభించిన సీఎం



ఇంటిలో పూజలు చేసుకుంటున్న సుజాత కుటుంబసభ్యులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను(కేసీఆర్ నగర్) గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించారు. ఆ ప్రాంగణంలోని పైలాన్‌ను మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మేయర్ విజయలక్ష్మిలతో కలసి ఆవిష్కరించారు. అనంతరం బ్యాటరీ వాహనంపై ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు రెండు పడకల ఇళ్ల కేటాయింపు పత్రాలను కేసీఆర్ అందించారు. అనంతరం రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించారు.

కేసీఆర్‌కు రుణపడి ఉంటాం

సొంతఇంటి కలను నిజం చేసిన కేసీఆర్‌కు రుణపడి ఉంటాం. నేను ఓ పరిశ్రమలో పనిచేస్తున్నా. నా భర్త రాజు డ్రైవర్. 2016లో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాం. ప్రభుత్వం మాకు డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించడం ఆనందంగా ఉంది.
– చాకలి సుజాత, కాటేదాన్ (రాజేంద్రనగర్)

మా ఓటు కేసీఆర్‌కే..



ఏళ్ల తరబడి అద్దె ఇంటిలో ఉంటున్నాం. అద్దెలు కట్టలేక ఇబ్బంది పడ్డాం. నా భర్త ఫారుఖ్ ఆటో డ్రైవర్. సంపాదించినదంతా అద్దె కట్టడానికే సరిపోయేది. 2020లో ఇంటి కోసం దరఖాస్తు పెట్టుకున్నాం. ఇప్పుడు మా సొంత ఇంటి కల నిజమైంది. మా ఓటు కేసీఆర్‌కే వేస్తాం.
– ఆసియాబేగం, గోకుల్‌నగర్ (పటాన్‌చెరు)

పేదోళ్ల కష్టం తెలిసిన వ్యక్తి



పేదోళ్ల కష్టం తెలిసిన వ్యక్తి కేసీఆర్. ఈ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుంది. నా భర్త చనిపోవడంతో కూలీకి వెళ్తూ జీవనం సాగిస్తున్న. కేసీఆర్ ప్రభుత్వం సొంత ఇంటి కలను నిజం చేసి మా జీవితంలో ఆనందం నింపింది.
– రేణుక, అంబేద్కర్‌కాలనీ (పటాన్‌చెరు)

వరాల జల్లు



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తదితరులు

పటాన్‌చెరుకు రెవెన్యూ డివిజన్, పాలిటెక్నికల్ కాలేజీలు మంజూరు

- మూడు మున్సిపాలిటీలకు రూ.30 కోట్ల చొప్పున నిధులు
- మూడు జీహెచ్‌ఎంసీ డివిజన్లకు రూ.10 కోట్లు చొప్పున..
- 55 గ్రామ పంచాయతీలకు రూ.15 లక్షలు
- పటాన్‌చెరు సభలో సీఎం కేసీఆర్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పటాన్‌చెరుపై వరాల జల్లు కురిపించారు. గురువారం సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన బహిరంగసభలో మాట్లాడారు. తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం, అమీన్‌పూర్ మున్సిపాలిటీలకు రూ.30 కోట్ల చొప్పున, జీహెచ్‌ఎంసీ మూడు డివిజన్లకు రూ.10 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేశారు. 55 గ్రామ పంచాయతీలకు రూ.15 లక్షల చొప్పున నిధులను మంజూరు చేశారు. రాయసముద్రం చెరువు సుందరీకరణకు నీటి పారుదలశాఖ నుంచి ప్రత్యేకంగా నిధులిస్తామన్నారు. సిద్దిపేట కోమటిచెరువు మాదిరిగా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల మంజూరు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు పటాన్‌చెరుకు పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఇందుకోసం ఈరోజే జీఓ జారీ చేస్తామని పేర్కొన్నారు. పటాన్‌చెరును రెవెన్యూ డివిజన్ చేస్తామని ప్రకటించారు. కొల్లూరులో 500 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఐటీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావును కొల్లూరుకు పంపుతామని చెప్పారు.

గూడెం అభ్యర్థిత్వం పరోక్షంగా ఖరారు

రానున్న ఎన్నికల్లో పటాన్‌చెరు ఎమ్మెల్యేగా గూడెం మహిపాల్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని సీఎం కేసీఆర్ పరోక్షంగా ఖరారు చేశారు. ఐదేళ్లలో పటాన్‌చెరువు ఎంతో అభివృద్ధి చెందిందని, గూడెం మహిపాల్‌రెడ్డిని మారోమారు గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని కేసీఆర్ ప్రకటించారు.

ఏడాదిలోగా ఆస్పత్రి నిర్మాణం

200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తి చేస్తామని కేసీఆర్ ప్రకటించారు. ఈ ఆస్పత్రి మంజూరుకు కృషి చేసిన మాజీ చీఫ్ సెక్రటరీ రాజీవ్‌శర్మ నిజాయతీకలిగిన అధికారి అన్నారు. రాష్ట్రంలో వైద్యరంగం ఎంతో అభివృద్ధి సాధించిందని, ఇస్నాపూర్‌లో 550 టన్నుల ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అధ్యక్షత జరిగిన బహిరంగసభలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, మహమూద్ అలీ, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, ఎంపీలు జోగినపల్లి సంతోష్ కుమార్, కొత్త ప్రభాకర్ రెడ్డి, రంజిత్ రెడ్డి, బీబీ పాటిల్, రాములు, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, యగ్గె మల్లేశం, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, దానం నాగేందర్, చంటి క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, మాణిక్‌రావు, హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, తెలంగాణ వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, సీఎస్ శాంతి కుమారి, సీఎం కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, కలెక్టర్ శరత్, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గల్లీగల్లీలో పాదయాత్ర చేశా

పటాన్‌చెరుతో అనుబంధాన్ని పంచుకున్న కేసీఆర్



సీఎం కేసీఆర్‌తో మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పట్టణంలోని గెస్ట్‌హౌస్‌లో మూడు రోజులు ఉన్నానని, గల్లీగల్లీలో తిరిగినట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తుచేశారు. అప్పటి ఎమ్మెల్యే సదాశివరెడ్డితో కలిసి పట్టణ సమస్యలు పరిష్కరించామన్నారు. ఈ ప్రాంత సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. గురువారం పట్టణంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం కేసీఆర్ స్థానిక నేతలను పేర్లతో పిలుస్తూ చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.సత్యనారాయణ, మాజీ ప్రొటెం స్పీకర్ భూపాల్ రెడ్డి పేర్లు ప్రస్తావిస్తూ వారు విన్నవించిన సమస్యలను వివరించారు. పటాన్‌చెరుకు రెవెన్యూ డివిజన్ కావాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తనను కలిసినప్పుడల్లా కోరాడన్నారు. పటాన్‌చెరు వరకు మెట్రో కావాలని మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ కోరారని తెలిపారు. సీఎం ప్రసంగిస్తున్నప్పుడు మహిపాల్‌రెడ్డి పేరు ప్రస్తావించిన ప్రతీ సందర్భంలోనూ స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సభలో పెద్దఎత్తున ప్రతిస్పందించారు. మహిపాల్‌రెడ్డి నేతృత్వంలో పటాన్‌చెరు అభివృద్ధి పథంలో ముందుకుపోతోందని కేసీఆర్ అన్నప్పుడు సభలో ఎమ్మెల్యే అభిమానులు, కార్యకర్తలు కేరింతలు కొట్టారు. ఎమ్మెల్యే తన ప్రసంగంలో కోరిన అన్ని సమస్యలకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. అప్పటికప్పుడు వరాలు కురిపించారు. సభలో తొలుత ఎమ్మెల్యే మాట్లాడుతూ పటాన్‌చెరులో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. ఇక్కడ సమస్యలపై కేసీఆర్‌కు పూర్తి అవగాహన ఉందన్నారు. గతంలో తాను ఎంపీటీసీగా ఉన్న కాలంలో కేసీఆర్ అప్పటి ప్రభుత్వంలో మంత్రి హోదాలో ఈ ప్రాంతంలో పర్యటించారని గుర్తు చేశారు. అందుకే ఎక్కువ విషయాలు చెప్పనంటూనే ఈ ప్రాంత వాసుల కోరికలను ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ప్రాంతంలో పాలిటెక్నిక్ కాలేజ్ కావాలని, మెట్రో రైలు ఇస్నాపూర్ వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మాన్‌సాగర్‌లో ఐటీ పార్కు ఏర్పాటు చేయాలని కోరారు.

మంజీరా నీరు జిల్లాకే..

పటాన్‌చెరు సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో మంత్రి హరీశ్‌రావు ప్రసంగిస్తూ తెలంగాణ రాకముందు, ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. కాంగ్రెస్ హయాంలో పారిశ్రామికవాడల్లో విద్యుత్ సరఫరా లేక కార్మికులు, యాజమాన్యాలు ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. రైతులు పడ్డ అవస్థలు వివరించారు.

న్యూస్‌రీల్


విద్యుత్ అధికారుల నిర్బంధం



గ్రామస్తులు నిర్బంధించిన అధికారులు

మెదక్‌జోన్ : సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విద్యుత్ అధికారులను నిర్బంధించిన ఘటన హవేళిఘనాపూర్ మండలం ఫరీద్‌పూర్‌లో చోటుచేసుకుంది. ఏప్రిల్, మే నెలలో కురిసిన ఈదురుగాలుల వానకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వాటిని సరిచేయాలని విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదు. అలాగే గ్రామానికి లైన్‌మెన్‌ను నియమించాలని కోరినా పెడచెవిన పెడుతున్నారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు గురువారం కరెంట్ బిల్లుల వసూలుకు గ్రామానికి వచ్చిన క్షేత్రస్థాయి అధికారులను పంచాయతీ భవనంలో నిర్బంధించారు. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు గ్రామానికి వెళ్లి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నిర్బంధంలో ఉన్నవారిని విడిపించుకు వెళ్లారు.

ప్రజారోగ్య రక్షణకు కృషి



ఎల్‌ఓసీ అందజేస్తున్న సునీతా లక్ష్మారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): పేదల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మండల పరిధి పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన భారతి అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండగా చికిత్స నిమిత్తం లక్ష రూపాయల ఎల్‌ఓసీని గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సునీత అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కౌడిపల్లి(నర్సాపూర్): ఉమ్మడి మెదక్ జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో గెస్ట్ ఉపాధ్యాయులు, లెక్చరర్ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఆర్‌సీఓ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 27వ తేదీ లోపు దగ్గరలో ఉన్న ఎంజేపీ గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

రాష్ట్రంలో బీజేపీదే అధికారం

పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్



ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో గడ్డం శ్రీనివాస్

మెదక్‌జోన్ : రాబోయే ఎన్నికల్లో విజయం సాధించి రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, అదేవిధంగా మెదక్ ఖిల్లాపై కాషాయం జెండా ఎగరవేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. మహా జన సంపర్క్ అభియాన్‌లో భాగంగా గురువారం పట్టణంలోని 12వ వార్డులో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతీ ఇల్లు తిరుగుతూ ప్రధాని మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి కరపత్రాల ద్వార ప్రజలకు వివరించారు. అలాగే కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. పట్టణంలోని 149వ బూత్‌లో బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బక్కవారి శివ, కిసాన్‌మోర్చా పట్టణ నాయకులు పుల్లపు యాదగిరితో పాటు మరికొందరు ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు చిరంజీవి, మోహన్, అజయ్ పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న నిరుపేదలు

మెదక్ కలెక్టరేట్: నిజమైన లబ్ధిదారులను గుర్తించి డబుల్‌బెడ్‌రూంలు ఇవ్వాలని ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్ బసవరాజు అన్నారు. గురువారం లబ్ధిదారులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్‌లో మొదటి విడత డబుల్‌బెడ్‌రూంల పంపిణీలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. గతంలో పిల్లికొటాల్‌లో ఇళ్ల స్థలాల గురించి సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం నిర్వహించగా అప్పటి గవర్నమెంట్ పేదలకు పట్టాలు ఇచ్చిందని తెలిపారు. వాటిని ఇప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొని అక్కడ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఇవ్వలేదన్నారు. వచ్చేనెల 3న ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల గురించి నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షురాలు నాగమణి, రాజురెడ్డి పాల్గొన్నారు.

తరుగు పేరుతో మోసం

న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు రైతుల మొర



ఎమ్మెల్యేకు మొర పెట్టుకుంటున్న రైతులు

మెదక్ కలెక్టరేట్ : తరుగు పేరుతో క్వింటాల్‌కు 12 కిలోల ధాన్యం దోచుకుంటున్నారని, తమకు న్యాయం చేయాలని టేక్మాల్ మండలం కొరంపల్లి గ్రామ రైతులు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని కోరారు. గురువారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యేను కలిసి రైతులు తమ గోడును వినిపించారు. తరుగు పేరిట జరుగుతున్న మోసంపై ఇప్పటికే అదనపు కలెక్టర్, డీఎస్ఓ, డీసీఓలకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ధాన్యం తరలించినప్పుడు ఒక లెక్క, బిల్లులో మరొకటి చూపుతూ అన్యాయం చేస్తున్నారని వాపోయారు. 126 బస్తాలను మిల్లుకు లోడ్ చేయించగా, బిల్లులో 116గా చూపిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి.. రైతులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం డీసీఓను సంప్రదించగా తరుగు ఎక్కువ తీయకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు.

నేడు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్ ఆవిష్కరణ

మెదక్ కలెక్టరేట్: మెదక్ జిల్లా కోర్టు ప్రాంగణంలో శుక్రవారం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్‌ను హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భుయాన్ వర్చువల్ పద్ధతిలో ఆవిష్కరిస్తారని జిల్లా జడ్జి లక్ష్మిశారద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.45గంటలకు హైదరాబాద్‌లోని హైకోర్టు సెంట్రల్ హాల్ నుంచి ప్రారంభిస్తారని తెలిపారు. హైకోర్టు జడ్జి జస్టిస్ నవీన్‌రావు, హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి సుమలత పాల్గొంటారని తెలిపారు.

26న ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలో 40 శాతం సర్టిఫికెట్ ఉన్న దివ్యాంగులకు ఈనెల 26న మేడ్చల్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఉచిత బస్ పాస్‌లు అందించనున్నట్లు ఎంపీడీఓ యాదగిరిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఈ నెల 26న మనోహరాబాద్‌లో జరిగే మొబైల్ క్యాంపునకు హాజరు కావాలని సూచించారు. వెంట సదరం సర్టిఫికెట్, ఆధార్ ఒరిజినల్ కార్డు, పాస్‌పోర్ట్ ఫొటోలు తీసుకురావాలని కోరారు.

ఇవి దగాకోరు ఉత్సవాలు

డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి



ఆర్డీఓ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

మెదక్‌జోన్ : బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించేవి రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు కావని.. ఇవి దగాకోరు ఉత్సవాలని డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి తీవ్రంగా విమర్శించారు. గురువారం పట్టణంలోని డీసీసీ కార్యాలయం నుంచి కాంగ్రెస్ నాయకులు ర్యాలీగా వెళ్లి స్థానిక బస్‌డిపో ఎదుట సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఇచ్చారు. అంతకు ముందు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేరలేదని అన్నారు. రూ.350 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ పనికి మాలిన దశాబ్ది ఉత్సవాలు చేయటం ఎవరికి ఉపయోగమని ఆయన మండిపడ్డారు. పాలనను గాలికి వదిలేసి ఉత్సవాల పేరుతో అధికారులు బీఆర్‌ఎస్ కార్యకర్తల్లా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులకు దమ్ము, ధైర్యం ఉంటే గన్‌మెన్‌లు లేకుండా గ్రామాల్లో తిరగాలని సవాల్ విసిరారు. జులైలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'మెదక్ బచావో' అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని, పదేళ్ల నిండకుండానే దశాబ్ది ఉత్సవాలు చేస్తున్నారని అన్నారు. ఎన్‌డీఎస్ఎల్ ఫ్యాక్టరీ తెరిపించలేని వారు ఉత్సవాలు జరపటం ఎందుకన్నారు. 2008లో మెదక్ మహిళాడిగ్రీ కళాశాలను తెస్తే దానిని ఇక్కడి నుంచి పంపినందుకా..?, రామాయంపేటను రెవెన్యూడివిజన్ చేస్తామని చేయనందుకా..? రామాయంపేటలో బస్టాండ్ ఏర్పాటు చేయనందుకా ఉత్సవాలను నిర్వహించేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో పీసీసీ నేత చౌదరి సుప్రభాత్‌రావు, మహిందర్‌రెడ్డి, హఫీజ్, శ్రీనివాస్, నాగిరెడ్డి, శ్రీమన్‌రెడ్డి పాల్గొన్నారు.

అమరుల త్యాగఫలమే తెలంగాణ

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

చిన్నశంకరంపేట(మెదక్) : అమరుల త్యాగ ఫలమే తెలంగాణ రాష్ట్రమని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతశేఖర్‌గౌడ్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ రోహిణి ప్రియదర్శినిలతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో అమరవీరుల స్మారక జ్యోతిని ఏర్పాటు చేసుకుని స్మరించుకుంటున్నామని అన్నారు. వారి ఆత్మకు శాంతి కలిగేలా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, జెడ్పీటీసీలు కృష్ణారెడ్డి, రమేష్‌గౌడ్, సర్పంచ్‌లు పూలపల్లి యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, బిక్షపతిగౌడ్, పోచయ్య, సిద్ధిరామ్‌రెడ్డి, నీరజగౌడ్, జ్యోతి, శారద, ఎంపీటీసీ అనురాధ పాల్గొన్నారు.

మెదక్ కలెక్టరేట్ : రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలు మరువలేనివని, సీఎం కేసీఆర్ ప్రతీ కార్యక్రమం వారిని తలచుకునే మొదలు పెడతారని ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో అమరుల సంస్మరణ తీర్మానం ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది. అనంతరం అమరుల త్యాగాలను స్మరిస్తూ సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. అదేవిధంగా వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 12 మంది అమరుల కుటుంబాలను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ వచ్చుడో.. సచ్చుడో అనే నినాదంతో అహింసా మార్గంలో సీఎం కేసీఆర్ 2009లో చావు చివరిదాక వెళ్లి వచ్చారని గుర్తు చేశారు. రాష్ట్ర సాధన కోసం శ్రీకాంతాచారి వంటి ఎందరో విద్యార్థులు తమ ప్రాణాలు అర్పించారని అన్నారు. ఏ ఆశయంతో బలిదానాలు చేశారో ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు పరుస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కోసం అసువులుబాసిన అమరుల త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, రమేశ్, జెడ్పీ సీఈఓ వెంకట శైలేష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

దశాబ్దాల పోరాటం..

మెదక్ మున్సిపాలిటీ: దశాబ్దాల పోరాటం, ఎందరో ప్రాణ త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. చిన్న శంకరంపేటలో అమరవీరుల స్థూపం వద్ద గురువారం ఆమె నివాళులర్పించారు.

క్లుప్తంగా

సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి..

ఉప సర్పంచ్‌పై కేసు నమోదు

అక్కన్నపేట(హుస్నాబాద్): కేశవాపూర్ గ్రామ పంచాయతీ ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్ల టైర్లలో గాలి తీసి, డీజిల్ పైప్ ఊడదీసి చోరీ ఘటనలో సీసీ కెమెరాల ఆధారంగా నిందితుణ్ని గుర్తించారు. ఈ ఫుటేజీలను గ్రామస్తులు, పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో పరిశీలించారు. వాటర్ ట్యాంకర్ల టైర్లల్లో గాలి తీసింది, డీజిల్ పైప్ ఊడదీసింది ఉప సర్పంచ్ బోనగిరి కుమారస్వామియేనని నిర్ధారించారు. పంచాయతీ కార్యదర్శి సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉప సర్పంచ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తాండ్ర వివేక్ పేర్కొన్నారు.

కుక్కల దాడిలో మేకలు మృతి



చేర్యాల(సిద్దిపేట): కుక్కల దాడిలో మేకలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చుంచనకోటలో గురువారం జరిగింది. ఎర్రోళ్ల మల్లయ్యకు చెందిన మేకల మందపై కుక్కలు దాడి చేసి మూడు మేక పిల్లలను చంపినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా చర్యలు తీసుకోలేదన్నారు.

భూ వివాదంలో గొడవ

రాయపోలు(దుబ్బాక): వ్యవసాయ భూమి విషయంలో గొడవ జరగడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన తూటికూర ముత్యంరెడ్డికి గత కొంతకాలంగా వెంకట్‌రెడ్డి అనే వ్యక్తితో తగాదా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో భూమి వద్ద గొడవ జరిగిందని, తనపై వెంకటరెడ్డి దాడి చేశాడని గురువారం ముత్యంరెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై విచారణ అనంతరం తగు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

లోన్ ఇప్పిస్తానని సైబర్ మోసం

దుబ్బాకరూరల్: మండలంలోని పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన తంగళపల్లి వెంకటస్వామికి రెండు రోజుల క్రితం ధని సంస్థ నుంచి మాట్లాడుతున్నామని మీకు లోన్ ఇస్తామంటూ ఫోన్‌లో నమ్మబలికారు. అది నమ్మిన బాధితుడు లోన్‌కు కొంతమొత్తం ఖర్చువుతుందని ఫోన్‌లో గుర్తుతెలియని వ్యక్తి చెప్పాడు. దీన్ని నమ్మిన బాధితుడు గూగుల్ పే ద్వారా విడతల వారిగా రూ.19వేలు పంపించాడు. అనుమానంతో బాధితుడు తిరిగి ఫోన్ చేయడంతో స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తను చేసేదేమి లేక మోస పోయినట్లుగా గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సీఐ కృష్ణ తెలిపారు.

పరిశ్రమలో కార్మికుడి మృతి



వికాస్ అహిర్వార్ (ఫైల్)

జిన్నారం(పటాన్ చెరు): వ్యర్థ ఘాటు వాసనలు పీల్చి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఎస్‌ఐ విజయకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కి చెందిన వికాస్ ఆహిర్వార్ (25) బొంతపల్లి పారిశ్రామిక వాడలోని రక్షిత్‌డ్రగ్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్నాడు. అక్కడ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒక్కసారిగా రసాయన వ్యర్థాలు వెలువడ్డాయి. దీంతో అతను స్పృహ కోల్పోయి వాంతులు చేసుకుంటూ కింద పడిపోయాడు. దీన్ని గమనించిన తోటి సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొనిదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీఎం రాకతో ట్రాఫిక్ జాం

ఇబ్బందుల్లో వాహనదారులు

పటాన్‌చెరు టౌన్: సీఎం కేసీఆర్ రాకతో జాతీయరహదారిపై ట్రాఫిక్ జాం అయ్యింది. వాహనాలు ముందుగానే నిలిపివేయడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. సీఎం కేసీఆర్ కొల్లూరు డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రారంభం అనంతరం కొండకల్‌లో రైల్వేకోచ్ పరిశ్రమను ప్రారంభించి, పటాన్‌చెరుకు వస్తున్న తరుణంలో ముందుగానే పటాన్‌చెరు రహదారిపై రాకపోకలు నిలిపివేశారు. దీంతో వాహనచోదకులు చాలసేపు వేచి ఉండటంతో ఇబ్బందులు పడాల్సి వచ్చిందని వాహనదారులు వాపోయారు.

తప్పని సాగునీటి కష్టాలు

- రోహిణి, మృగశిర కార్తెలో పడని చినుకులు
- ఆరుద్ర కార్తె పైనే ఆశలు
- అదను దాటితే సాగు కష్టం
- గౌరవెల్లికి గోదావరి జలాలు



డ్రమ్ సీడర్ ద్వారా విత్తనం వేస్తున్న రైతు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మెట్ట ప్రాంత రైతులు వానల కోసం ఎదురు చూస్తే కష్టాలు తీరలే. వానకాలం సాగుకు అనువైన కార్తెలు రోహిణి, మృగశిర ఆరుద్ర కార్తెలు రెండు ముగిసింది. తొలకరి పలకరించలే రైతు కాడి పట్టలే. ఆరుద్ర కార్తెలో చినుకులు పడితేనే రైతు దుక్కి దున్ని విత్తనం వేసేది. అలాంటప్పుడు వానలు పడకపోతే మెట్ట ప్రాంత రైతులకు సాగు నీటి కష్టాలు తప్పవు. హుస్నాబాద్ మెట్ట ప్రాంతానికి కల్పవల్లి గౌరవెల్లి ప్రాజెక్టు పనులు దాదాపు పూర్తి దశకు చేరుకుంది. సీఎం కేసీఆర్ చేత ఈ నెల 28, 29లోనే ప్రారంభించి మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలను తెచ్చేందుకు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. గోదావరి జలాలు గౌరవెల్లికి వస్తే కుడి, ఎడమ కాల్వల ద్వారా 1,06,000ల ఎకరాలకు సాగు నీరు అందడంతో పాటు వానల మీద రైతులు ఆశలు పెట్టుకొనే అవకాశం ఇక ఉండదు.

మెట్ట ప్రాంతంలో లక్షల ఎకరాల సాగు

హుస్నాబాద్ డివిజన్ పరిధిలో 70వేల ఎకరాల్లో పత్తి, 35వేల ఎకరాల్లో వరి, 10 ఎకరాల్లో మొక్కజొన్న, మరో 10 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. 1,25,000 ఎకరాల్లో వాన కాలం పంటలను సాగు చేసే రైతులకు సాగు నీరు కష్టాలే కలవర పెడుతున్నాయి. గత ఐదేళ్ల నుంచి వానలు సమృద్ధిగా పడటంతో చెరువులు, కుంటల్లో నీరు చేరి ఊట బావులు నిండు కుండలాగా మారడంతో రైతులకు సాగు నీరు కష్టాలు రాలేదు. ఈ ఏడాది రెండు కార్తెలు పోయిన చినుకు కూడా పడకపోవడంతో పంటల సాగుపై ఆందోళన చెందుతున్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు పూర్తి కావడం ప్రారంభానికి అధికారులు చర్యలు చేపట్టడంతో రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. చినుకు రాలకపోయిన గోదావరి జలాలు రైతులను ఆదుకుంటాయని ఆశ పడుతున్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణం

గౌరవెల్లి ప్రాజెక్టుకు 2008, మే30 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. 1.40 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే ప్రాజెక్టు పనులు అప్పటికే 75శాతం పూర్తయింది. తెలంగాణ ఏర్పాటైన తరువాత ప్రాజెక్టు సామర్థ్యాన్ని సీఎం కేసీఆర్ 1.40 టీఎంసీల నుంచి 8.23 టీఎంసీలకు పెంచి రూ.1196.06 కోట్లను మంజూరు చేసింది. ప్రాజెక్టు కోసం 3870 ఎకరాల భూ సేకరణ చేసి పరిహారం అందజేశారు. 817 గృహాలకు పరిహారం చెల్లించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద 1104 మందికి పరిహారం అందించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తయితే హుస్నాబాద్ నియోజకవర్గంలో 57,852 ఎకరాలకు సాగు నీరు అందనుంది. హన్మకొండ జిల్లాలో వేలేరు, ధర్మసాగర్, కాజీపేట మండలాల్లో 43,832 ఎకరాలకు, జనగామ జిల్లాలో 48,148 ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

పంటకు బలం రోహిణి కార్తె



పంటకు బలం రోహిణి కార్తెలో ఉంటుంది. నారు పోసి పొలం దున్ని నాటు వేద్దామంటే వానల జాడే లేదు. రెండు కార్తెలు పాయే. ఒక చినుకు రాలేదు. పునాస విత్తనానికి ఇంకా దుక్కులే తయారు చేయలేదు. ఇక ఈ పదిహేను రోజులు విత్తనానికి అనువైన కాలం. ఆరుద్ర కార్తెలో కూడా వానలు పడకుంటే పునాస పంటలు పండేది నమ్మకం తక్కువే. గోదావరి నీళ్లు వస్తే చెరువుల్లో నీళ్లు వచ్చినట్లే.

– పోలు మహేందర్, రైతు

పంట సాగుకు అనువైన సమయం



వానలు ఆస్యమైనా విత్తనం వేసుకొనే సమయం ఉంది. జూలై 20 వరకు పత్తి విత్తనాలు పెటొచ్చు. దీర్ఘకాలిక వరి నారు పోసే సమయం దాటింది. మధ్యకాలిక, స్వల్పకాలిక రకాలను రైతులు వేసుకోవచ్చు. వానలు కురిసిన తర్వాతే దుక్కి దున్ని విత్తనం వేసుకోవాలి. తొలకరి జల్లులకు రైతులు విత్తనాలు వేస్తే మొలకెత్తవు. గౌరవెల్లి ప్రాజెక్టుకు గోదావరి జలాలు వస్తే మెట్ట ప్రాంత రైతులకు సాగు నీటి కష్టాలు తప్పినట్లే.

– పి మహేశ్, ఏడీఏ, హుస్నాబాద్

రైతాంగాన్ని మోసం చేసిన కేంద్రం

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్



మాట్లాడుతున్న శోభన్

చేర్యాల(సిద్దిపేట): రైతులకు తక్కువ మద్దతు ధర ప్రకటించి కేంద్ర ప్రభుత్వం రైతాంగాన్ని మోసం చేసిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ విమర్శించారు. గురువారం పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరల్లో ఒక్క పంటకు కూడా ప్రామాణికాలు పాటించకుండా నిర్ణయించడం దారుణమన్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారకమందుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. దీంతో రైతులకు సాగు ఖర్చు పెరిగిందన్నారు. అకాల వర్షాలు, ఇతర విపత్తులతో కలిగే నష్టాలు చెప్పలేనివన్నారు. ఇ–క్రాప్ వంటి డిజిటల్ పద్ధతితో పంటలకు అందాల్సిన బీమా అందకుండా కోట్లాది రూపాయల ప్రీమియం డబ్బులు కార్పొరేట్ సంస్థలకు చేరుతుందే తప్ప రైతులకు లాభం లేదని విమర్శించారు. విత్త సంస్థల రుణసహాయం కూడా అందడం లేదన్నారు. సాగు పెట్టుబడి తక్కువగా చూపి జాతీయ సగటు కంటే అధికంగా ఎంఎస్‌పి ఇచ్చామంటూ ప్రచారం చేస్తున్న మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా స్వామినాథన్ కమిషన్ ప్రతిపాదించిన ప్రకారం ఎంఎస్‌పి ప్రకటించి చట్టబద్ధం చేయాలన్నారు. సత్తిరెడ్డి, యాదవరెడ్డి, కృష్ణారెడ్డి, నర్సిరెడ్డి, మల్లారెడ్డి, యాదయ్య, బాలస్వామి పాల్గొన్నారు.

కొడుకు చనిపోయిన బాధను మింగి..

అవయవాల దానం



మెక్కని బాబు (ఫైల్)

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో చనిపోయిన కొడుకు అవయవాలను తల్లిదండ్రులు దానం చేశారు. మెక్కని శ్రీనివాస్, కనకవ్వల దంపతుల పెద్ద కుమారుడు మెక్కరి బాబు(22) ఈ నెల14వ తేదీన ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో చికిత్సనిమిత్తం అతణ్ని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కొడుకు చనిపోయి పుట్టెడు దుఖంలో ఉన్న తల్లిదండ్రులు ఇతరుల ప్రాణం కాపాడేందుకు అవయవాలను (కిడ్నీ, లీవర్) దానం చేశారు. తమ కొడుకు అవయవాలతో ఆపదలో ఉన్న వారికీ ప్రాణం పోయడం గొప్ప విషయమన్నారు. దీంతో తమ కొడుకు రూపాన్ని బతికి వారిలో చూసుకుంటామని మృతుని తల్లి దండ్రులు గుండెనిబ్బరంతో చెప్పారు.

గ్రామంలో విషాదచ్ఛాయలు..

మెక్కని శ్రీనివాస్ కనకవ్వలు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పెద్ద కొడుకు బాబు ట్రాక్టర్ డ్రైవరు. తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. మృతుని కుటుంబాన్ని సర్పంచ్ పాల్కంపల్లి జయంతి, ఎంపీటీసీ భూములుగౌడ్, మాజీ సర్పంచ్ కాచం నవీన్‌కుమార్, పీఎస్‌ఆర్ ట్రస్టు నిర్వాహకుడు పాల్కంపల్లి నరేందర్‌లు పరామర్శించారు. బాబు మృతితో గ్రామంలో విశాదచ్ఛాయలు అలుముకున్నాయి.

ధైవదర్శనానికి వెళ్తూ.. అనంతలోకాలకు

ట్రాలీ ఆటో ఢీ కొని దంపతుల మృతి



భార్యాభర్తల మృతదేహాలు

కౌడిపల్లి(నర్సాపూర్): భార్యాభర్తలు దైవదర్శనానికి టీవీఎస్ ఎక్సల్‌పై వెలుతుండగా ట్రాలీ ఆటో, టీవీఎస్ ఎక్సల్‌ను ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కౌడిపల్లి ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మగ్దుంపూర్ గ్రామానికి చెందిన జక్కుల యాదగిరి(36) తాపీ మేస్త్రీ పనులు చేసుకుంటూ కుంటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతని భార్య యాదమ్మ(32) గ్రామంలో వ్యవసాయ కూలీ పనులు చేస్తుంది. యాదగిరి భార్యతో కలిసి టీవీఎస్ ఎక్సల్‌పై తునికి నల్లపోచమ్మదేవిని దర్శించుకునేందుకు ఇంటినుంచి బయలు దేరాడు. నర్సాపూర్‌కి చెందిన చందాపురం యాదాగౌడ్ తన ట్రాలీ ఆటోలో మెదక్‌వైపుగా వస్తున్నాడు. ఈ క్రమంలో అంతారంగేట్ సమీపంలోకి రాగానే ట్రాలీఆటో, టీవీఎస్ ఎక్సల్‌ను బలంగా ఢీకొంది. దీంతో టీవీఎస్ ఎక్సల్‌పై ఉన్న భార్యాభర్తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్‌ఐ శివప్రసాద్ రెడ్డి, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్‌చేసి మృతదేహాలను నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కొడుకు వంశి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆటోడ్రైవర్ పరారీలో ఉన్నాడు.

సర్పంచ్ అనుమానాస్పద మృతి



పాపయ్య (ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న సర్పంచ్ కుటుంబీకులు

కల్హేర్(నారాయణఖేడ్): అనుమానాస్పదంగా సర్పంచ్ మృతి చెందాడు. మహదేవ్‌పల్లి సర్పంచ్ నాగధర పాపయ్య(60) అదే గ్రామానికి చెందిన నీరుడి సాయిరాం, మరికొందరితో కలిసి బాచేపల్లి డాబా హోటల్‌లో మద్యం తాగేందుకు వెళ్లారు. అక్కడి నుంచి పెద్దశంకరంపేట వైపు వెళ్లారు. కమలపూరం వద్ద ఆటో బోల్తా పడడంతో సర్పంచ్ పాపయ్య రోడ్డు ప్రమాదానికి గురయ్యాడని, నీరుడి సాయిరాం ఫోన్‌లో కుటుంబీకులకు సమాచారం చేరవేశాడు. ఈ క్రమంలో సర్పంచ్‌ను గిట్టనివారే హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారని కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేశారు.

కుటుంబీకులు, గ్రామస్తుల ఆందోళన..

బీఆర్‌ఎస్‌కి చెందిన సర్పంచ్ నాగధర పాపయ్యను సొంత పార్టీ నాయకులే హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారని కుటుంబీకులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. అనుమానితుడిగా భావిస్తున్న నీరుడి సాయిరాం ఇంటి వద్ద మృతదేహాన్ని ఉంచి మృతుడి కుటుంబీకులు ఆందోళన చేశారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి, సీఐ రామకృష్ణారెడ్డి అక్కడికి వెళ్లి కుటుంబీకులను నచ్చజెప్పారు. సర్పంచ్ పాపయ మృతి పట్ల అనుమానం ఉంటే విచారణ అనంతరం నిందితులను శిక్షిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కుటుంబీకులు ఆందోళన విరమించారు.

సర్పంచ్ మృతి బాధాకరం: ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మహదేవ్‌పల్లి సర్పంచ్ నాగధర పాపయ్య మృతి బాధాకరమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన పాపయ్య మృతి పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

హత్నూరలో యువకుడి..



వెంకటేశ్ (ఫైల్)

హత్నూర (సంగారెడ్డి): బడంపేట గ్రామానికి చెందిన గాండ్ల శివయ్య కుమారుడు వెంకటేశం (20) మూడు నెలల నుంచి ఖైరతాబాద్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 18వ తేదీ బడంపేట గ్రామానికి వచ్చిన అతను 20వ తేదీ ఇంట్లో హైదరాబాద్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. కుటుంబ సభ్యులు వెంకటేశ్‌కు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చిందన్నారు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు బంధువుల ఇంటి వద్ద, హైదరాబాద్‌లో వెతికినా ఫలితం లేదు. దీంతో తండ్రి శివయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పటాన్‌చెరు టౌన్‌లో కూతురు..

పటాన్‌చెరు టౌన్: కూతురు అదృశంపై తండ్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు మండలం చిన్న కంజర్ల గ్రామానికి చెందిన షేక్ మోయిన్ పాషా కూతురు షేక్ హీన(19) ఇంటర్ వరకు చదివి, ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటుంది. ఈ క్రమంలో ఈ నెల 21వ తేదీన ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఆమె తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళనకు గురైన తండ్రి కూతురు అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దాతర్‌పల్లిలో యువతి..



శిల్ప (ఫైల్)

తూప్రాన్: ఇంటి నుంచి బయటికి వెళ్లిన యువతి తిరిగి రాలేదు. ఎస్‌ఐ సురేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..దాతర్‌పల్లి గ్రామానికి చెందిన చింతల మల్లేశం కూతురు శిల్ప(20) నర్స్‌గా పని చేస్తుంది. ఈ నెల 13న అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, బంధువులు, చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం



సిద్దిపేటకమాన్: ఓ ఆటోడ్రైవర్ ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్య యత్నానికి పాల్పడిన సంఘటన సిద్దిపేట పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మద్దూరు మండలం జాలపల్లి గ్రామానికి చెందిన చెట్కూరి నరేశ్ సిద్దిపేట సుభాష్ నగర్‌లో నివాసం ఉంటూ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్యతో విబేధాల కారణంగా వేరుగా ఉంటున్నాడు. దీంతో మద్యానికి బానిసై అనారోగ్య సమస్యలు తలెత్తినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో నరేష్ సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ వద్ద తన ఆటోలో బాటిల్‌లో తెచ్చుకున్న డీజిల్‌ను తన ఒంటిపై పోసుకున్నాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ హోంగార్డు ఇర్ఫాన్ దీన్ని గమనించి పక్కనే ఉన్న ఓ దుకాణంలోంచి బకెట్ నీళ్లు తీసుకువచ్చి అతనిపై పోశాడు. అనంతరం సంఘటనా స్థలానికి చేరుకున్న వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ బ్లూ కోల్ట్స్ సిబ్బంది బాధితుడ్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: చెట్టుకు ఉరివేసుకొని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు పట్టణంలోని మున్నూరు కాపు సంఘం భవనం వెనుకాల చెరువు దగ్గరలో ఓ వ్యక్తి లుంగితో చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక యువ రైతు..



కరుణాకర్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): అప్పుల బాధ తాళలేక యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ శ్రీధర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చుక్క నర్సవ్వ రాములు దంపతుల పెద్ద కుమారుడు కరుణాకర్ (26) తనకున్న 3 ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ తల్లిదండ్రులతో పాటు తమ్ముడు శ్రీనివాస్‌తో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మూడు సంవత్సరాల్లో అందిన కాడికి అప్పులు చేసి ఐదు బోర్లు వేశాడు. అందులో చుక్క నీరు పడలేదు. ఐదో బోరులో కొద్ది పాటి నీరు వస్తుండటంతో సాగు నల్లేరుపై నడకలా మారింది. ఇటీవల వడగండ్ల వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. సాగు కోసం సుమారు రూ.3 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనోవేదనకు గురై కరుణాకర్ తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తమ్ముడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొల్చారం ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..పోతంశెట్టిపల్లి గ్రామానికి చెందిన మాసాని భీముడు (36) ఈ నెల 6న గ్రామ శివారులోని రైతు వేదిక సమీపంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ని ఢీ కొన్నాడు. దీంతో అతణ్ని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ భీముడు బుధవారం రాత్రి మృతి చెందాడన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మనస్థాపంతో పురుగుల మందు తాగి..

తూప్రాన్: మద్యానికి బానిసైన వ్యక్తి మనస్థాపంతో పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ సురేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..హైదర్‌గూడకు చెందిన పిట్ల శంకర్(35) ఆరు సంవత్సరాల క్రితం రాయపోల్ మండలం మాచిన్‌పల్లి గ్రామానికి చెందిన చంద్రకళతో వివాహం జరిగింది. పిట్ల శంకర్ ఆటో నడుపుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అతను మద్యానికి బానిసై భార్యతో నిత్యం గొడవ పడుతుండేవాడు. దీంతో భార్య రెండు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్థాపానికి గురైన శంకర్ బుధవారం పురుగుల మందు సేవించి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి వైద్యుల సలహా మేరకు గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని తల్లి భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సు, స్కూటీ ఢీ..

ముగ్గురికి గాయాలు



కౌడిపల్లి(నర్సాపూర్): ఆర్టీసీబస్సు ఆక్టీవ స్కూటీ ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్‌వైపు వెలుతుంది. నారాయణఖేడ్, సిర్గాపూర్ ప్రాంతానికి చెందిన ఆరుగురు విద్యార్థులు తునికి ఎంజేపీ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. టీసీలు తీసుకునేందుకు రెండు బైక్‌లపై వెళ్లి వస్తున్నక్రమంలో కౌడిపల్లిలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌బంక్ వద్ద ఆర్టీసీబస్, ఆక్టీవ ఢీకొన్నాయి. ఈ సంఘటనలో సంగమేశ్వర్, ప్రసాద్, కుమార్‌లకు తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బస్సు వెనుక చక్రాల కింద పడి..



గాయపడ్డ అబ్దుల్ కరీం

శివ్వంపేట(నర్సాపూర్): ఆర్టీసీ బస్సు వెనుక చక్రాల కింద పడిన వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సంగారెడ్డి నుంచి గజ్వేల్‌కు వెళ్తూ శివ్వంపేటలో ఆగింది. నర్సాపూర్‌కు చెందిన అబ్దుల్ కరీం తూప్రాన్ వెళ్లేందుకు శివ్వంపేటలో ఆగిన బస్సు ఎక్కాడు. ఈ క్రమంలో కదులుతున్న బస్సులో నుంచి కిందికి దిగే ప్రయత్నంలో అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో ఎడమకాలు పాదంపై నుంచి బస్సు చక్రాలు పోవడంతో కాలు పాదం నుజ్జునుజ్జయింది. దీన్ని గమనించిన స్థానికులు, పోలీసుల సాయంతో 108 అంబులెన్స్‌లో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నారాయణఖేడ్‌లో..



నారాయణఖేడ్: బైక్, స్కూటర్ ఢీకొన్న దృశ్యం

నారాయణఖేడ్: వెంకటాపూర్ చౌరస్తా సమీపంలో స్కూటర్‌పై వెళ్తున్న నారాయణఖేడ్‌కు చెందిన వడ్డె వెంకయ్యను ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయినట్లు స్థానికులు తెలిపారు. చికిత్స నిమిత్తం అతణ్ని108 అంబులెన్స్‌లో నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించారు.

సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ నర్సింలు

హత్నూర (సంగారెడ్డి): పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా గురువారం కొనసాగింది. మండల పరిషత్ అధ్యక్షుడు వావిలాల నరసింహులు అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం జరిగింది. పూర్తిస్థాయిలో అధికారులు హాజరు కాకపోవడంతో సర్పంచ్, ఎంపీటీసీ సైతం పూర్తిస్థాయిలో పాల్గొనలేదు. ఆయా శాఖల అధికారులు నివేదికలు సైతం సమర్పించకపోవడంతో వచ్చిన ఎంపీటీసీలు సర్పంచులు సైతం అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షురాలు పండగ లక్ష్మి, ఎంపీడీఓ శారదా దేవి, తహసీల్దార్ పద్మావతి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి

రాయికోడ్(అందోల్): కొత్తగా పట్టా పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుబంధు పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ సూచించారు. గురువారం తన కార్యాలయంలో మాట్లాడుతూ జూన్ 16వ తేదీ వరకు భూ పట్టా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు వానాకాలం పెట్టుబడి సాయం పొందడానికి అర్హులన్నారు. ఈ నెల 26వ తేదీలోపు రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నోటు పుస్తకాల పంపిణీ

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని మాలపాడ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎంపీటీసీ సభ్యుడు సంతోష్ గౌడ్ గురువారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి అంజయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దాతలు ప్రభుత్వం, ఇస్తున్న సహకారంతో విద్యార్థులు బాగా చదివి ఉత్తమ పౌరులై సమాజానికి సేవలందించాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు సంతోష్ గౌడ్‌కు మండల విద్యాధికారి అంజయ్య అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడి మృతి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని మద్దికుంట మాజీ ఎంపీటీసీ జనార్దన్ రెడ్డి(65) గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గతంలో ఎంపీటీసీ గ్రామానికి సేవలు అందించారు. శుక్రవారం గ్రామంలో అంత్యక్రియలను నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.